సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 7 । మే । 2023



వందశాతం అక్షరాస్యతకు కృషి

లక్సెట్టిపేట: గ్రామంలో వంద శాతం అక్షరాస్యతకు కృషి చేయాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని చందారం గ్రామ వయోజన విద్యా కేంద్రాన్ని పరిశీలించారు.



సైన్స్ సెంటర్ సందర్శించిన డీఈవో

మంచిర్యాలఅర్బన్: డీఈవో యాదయ్య శనివారం జిల్లా సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. సైన్స్ సమ్మర్ క్యాంపు పరిశీలించారు. ఐదో రోజు గుండె పని విధానం, కృత్యాధార బోధన తీరును గమనించారు.

గరిష్టం/కనిష్టం
35.0 /27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడో, రేపో తహసీల్దార్ల బదిలీలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు నేడో, రేపో అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఆయా మండలాల్లో పని చేస్తున్న తహసీల్దార్లను వేరే చోటుకు బదిలీ చేస్తూ జాబితా సిద్ధమైంది. తగిన పోస్టు దక్కేలా కొందరు పైరవీలు చేసుకుంటున్నారు. పలువురు తహసీల్దార్లు జిల్లా కేంద్రంతోపాటు ముఖ్య పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలకు వచ్చేలా చూసుకుంటున్నారు. సుదూర ప్రాంతాలు, మారుమూల, కొత్త మండలాల్లో పని చేస్తున్న వారు సైతం పట్టణాలకు వచ్చేలా రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, బదిలీల్లో కోరుకున్న చోట పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి వెబ్‌సైట్



చట్టాలు, హక్కుల బుక్‌లెట్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: వయోవృద్ధుల సంక్షేమానికి తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటనెన్స్ కేసెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(టీఎస్‌సీఎంఎంఎస్) వెబ్‌సైట్‌ను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల ఆర్డీవో దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్యలతో కలిసి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ వయోవృద్ధులను ఎవరైనా వేధించినా, అన్యాయానికి గురి చేసినా, వారిపై అఘాయిత్యాలకు పాల్పడినా, లైంగిక వేధింపులకు గురి చేసినా వారిపై చర్య తీసుకునేందుకు ఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. https://tssenior citizens. cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డీసీపీవో ఆనంద్, ఫర్హాన పాల్గొన్నారు.

అధ్యాపకులకు నియామక పత్రాలు అందజేత

మంచిర్యాలఅర్బన్: కాంట్రాక్టు లెక్చరర్లను పర్మినెంట్ చేస్తూ ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో అధ్యాపకులకు నియామక పత్రాలు అందజేశారు. 73 మంది జనరల్ అధ్యాపకులు, ఐదుగురు వొకేషనల్ అధ్యాపకులు పర్మినెంట్ లెటర్లు అందుకున్నారు. ఈ నెల 3న కాంట్రాక్టు లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుల సంబంధిత సర్టిఫికెట్లను పరిశీలించాలని ఇంటర్ విద్య కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల ఇంటర్ విద్య అధికారులు ఈ నెల 4న ధ్రువీకరణ పత్రాలు పరిశీలన పూర్తి చేశారు. 5న హుటాహుటినా హైదరాబాద్ నుంచి అపాయ్‌మెంట్ లెటర్లు తెచ్చి అర్ధరాత్రి అధ్యాపకులకు అందజేశారు. పక్క జిల్లా కుమురంభీం జిల్లాలో శనివారం నియామక పత్రాలు అందజేసినట్లు తెలుస్తోంది. ఇదంతా డీఐఈవో కార్యాలయంలో ప్రిన్సిపాల్ చేతులమీదుగా ఒప్పంద ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే వరకు గోప్యంగా సాగడం చర్చనీయాంశమైంది.

మొక్కలు ఎండకుండా చూసుకోవాలి

జన్నారం: నర్సరీలోని మొక్కలు వేసవిలో ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీరు పోసి కాపాడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. శనివారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీ, డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించి సమ్మె విరమించి విధుల్లో చేరాలని అన్నారు. ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో రమేశ్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.

'కమీషన్ల కోసం జంక్షన్ల పనులు'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో నాలుగు జంక్షన్ల నిర్మాణాలను కమీషన్ల కోసమే చేపడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఎన్నికల హామీల అమలులో విఫలమయ్యారని, రూ.271 కోట్లతో గోదావరి నదిపై వంతెన, ఐబీ నుంచి క్యాతన్‌పల్లి వరకు రహదారి విస్తరణ, ప్రభుత్వ ఆసుపత్రిలో 250 పడకలకు పెంపు, లక్ష్మీ టాకీస్ నుంచి రాజీవ్‌నగర్ వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ, తోట మల్లికార్జున్, ఆకుల సంతోశ్, రాకేశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఊరంతా ట్రాక్టర్లే..

• వ్యవసాయమే ఆధారం • పెరిగిన సాగు విస్తీర్ణం



సండే స్పెషల్

పార్కింగ్ చేసి ఉన్న వ్యవసాయ ట్రాక్టర్లు

బెల్లంపల్లి: అదో మారుమూల గ్రామం. వ్యవసాయమే జీవనాధారం. సాగునీటి వనరులు అంతంత మాత్రమే.. ప్రకృతి కరుణిస్తే గానీ పంటలు పండించలేని పరిస్థితి. వర్షాధారంపై ఆధారపడి ఎత్తువల్లాలతో ఉన్న భూముల్లో ఆ గ్రామ రైతులు తెల్ల బంగారం(పత్తి) పండిస్తూ వ్యవసాయంలో నిలదొక్కుకుంటున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకుంటూ.. పూరిళ్ల నుంచి స్లాబ్ ఇళ్ల నిర్మాణం వైపు అడుగులేస్తున్నారు. వ్యవసాయంలో పూర్తిగా యాంత్రీకరణను అనుసరిస్తూ.. సంప్రదాయ సాగు పద్ధతులకు భిన్నంగా ట్రాక్టర్ల ద్వారా సేద్యం చేస్తూ బెల్లంపల్లి నియోజకవర్గంలోని భీమిని మండలం వెంకటాపూర్ గ్రామం ప్రత్యేకతను చాటుకుంటోంది. ఈ గ్రామంలో ఉన్నన్ని ట్రాక్టర్లు మరే గ్రామంలోనూ లేకపోవడం గమనార్హం.

పంట మార్పిడి..

గ్రామంలో 2006 సంవత్సరం ముందు వరకు సంప్రదాయంగా వస్తున్న జొన్న, కంది, పెసర, మిర్చి పంటలు పండించేవారు. ఆశించిన లాభాలు లేకపోవడంతో గ్రామంలో అనేక కుటుంబాలు వందలాది ఎకరాల భూములను బీళ్లుగా వదిలేశారు. ఆంధ్రా ప్రాంతం నుంచి వలస వచ్చిన రైతులు భూములను కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశారు. అప్పట్లో ఎకరానికి కనిష్టంగా రూ.500 నుంచి గరిష్టంగా రూ.2వేల వరకు కౌలు ఉండేది. 2014 తర్వాత స్థానిక రైతులూ పత్తి పంట సాగుపై దృష్టి సారించారు.

యాంత్రీకరణకు పెద్దపీట

పంటల సాగులో యాంత్రీకరణకు రైతులు పెద్దపీట వేస్తున్నారు. ఒక్కో రైతు కనిష్టం ఆరెకరాల నుంచి గరిష్టంగా 50 ఎకరాల వరకు పత్తి సాగు చేస్తున్నారు. ఏకకాలంలో దుక్కులు దున్నడం, ఇతరత్రా పనులు చేపట్టడం నాగళ్ల ద్వారా సాధ్యమయ్యే పని కాదని అనుభవం ద్వారా తెలుసుకున్నారు. ఒక్కొక్కరుగా ట్రాక్టర్లను ప్రైవేటు ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేశారు. ఇప్పటివరకు గ్రామంలో 60కి పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. వీటితోపాటు 15వరకు బొలేరో వాహనాలు, జేసీబీ, హార్వేస్టర్‌లు కూడా వ్యవసాయంలో వినియోగిస్తున్నారు. రైతు తన అవసరాలకు అనుగుణంగా ట్రాక్టర్‌ను వినియోగించుకోవడంతోపాటు అవసరమైన రైతుల వ్యవసాయ భూముల్లో ట్రాక్టర్‌తో పనులు చేస్తున్నాడు. కిరాయి ద్వారా ఏటా ఒక్కో రైతు గరిష్టంగా రూ.40వేల వరకు సంపాదిస్తున్నారు.

నాలుగు వేలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు

గ్రామంలో మూడు వేలకు పైగా ఎకరాల్లో రైతులు పత్తి పంట, మరో 250 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లోని చిన్న, సన్నకారుల రైతుల భూములు మరో వెయ్యి ఎకరాల వరకు కౌలుకు తీసుకుని పత్తి పండిస్తున్నారు. మొత్తంగా గ్రామ రైతులు నాలుగు వేల ఎకరాల్లో ఏటా పత్తి సాగు చేస్తున్నారు. ప్రధానంగా పత్తి పంట పండిస్తూ ఇంటి అవసరాల కోసం వరి పండిస్తున్నారు. పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతుండడంతో ప్రస్తుతం కౌలు ధర కూడా పెరిగింది. ఎకరానికి గరిష్టంగా రూ.10వేల నుంచి రూ.15వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. గ్రామంలో పత్తి సేకరణకు ఏటా వెయ్యి మంది వరకు కూలీలు ఇతర ప్రాంతాల నుంచి వలస వస్తుంటారు. మహారాష్ట్ర, కర్నూల్, రాజస్థాన్ ప్రాంతాల నుండి వచ్చిన కూలీలు మూడు నెలల పాటు ఇక్కడే ఉండి పత్తి సేకరణ పూర్తయ్యాక స్వస్థలాలకు వెళ్తుంటారు.

250 కుటుంబాలు.. 1000కి పైగా జనాభా

గ్రామంలో 250 కుటుంబాలు ఉండగా వెయ్యికి పైగా జనాభా ఉన్నారు. అత్యధికంగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో పంటలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. క్రమంగా వృద్ధిలోకి వస్తూ స్థిరనివాసాలు నిర్మించుకుంటున్నారు. పుష్కర కాలం క్రితం గూనపెంకులు, మట్టిగోడలతో పూరిళ్లు ఉండగా.. ప్రస్తుతం స్లాబ్ ఇళ్ల నిర్మాణం పెరుగుతోంది. ఇందుకు పత్తి పంట సాగే కారణమని చెబుతున్నారు.

ఇళ్లల్లో తెల్ల బంగారం నిల్వ

పత్తిని మద్దతు ధరకు అమ్ముకుంటే కానీ లాభం రాదు. ఆ విషయాన్ని గ్రహించిన రైతులు తొందరపడి పత్తి అమ్మడానికి సిద్ధపడరు. అత్యవసరమైతే తప్పా విక్రయించరు. సేకరించిన పత్తిని ఇళ్లలో భద్రపరుస్తారు. మద్దతు ధర ప్రకటించాక ప్రత్యేక వాహనాల్లో జిన్నింగ్ మిల్లులకు తరలించి విక్రయిస్తారు. అప్పటివరకు ఇళ్లల్లో నిల్వ చేస్తుంటారు.


మొదలు కొన్నది నేనే..



పత్తి పంట సాగు జేసుడు సురు జేసినంక నాగళ్ల తోని దుక్కులు దున్నడం సాధ్యం కాలేదు. మస్తు తక్లీబ్ అయింది. గిట్లైతే కాదని ట్రాక్టర్ కొని తీసుకొచ్చిన. ట్రాక్టర్‌తోని దుక్కులు దున్నడం హలగైపోయింది. మా ఊళ్ళ ట్రాక్టర్‌ను మొదాలు నేను తీస్కచ్చినంక నన్ను జూసి ఇంకొకలు ట్రాక్టర్ తెచ్చిండ్లు. గా తరీఖ మాఊళ్ళ ట్రాక్టర్లు వరుస గట్టి తీస్కచ్చిండ్లు. ఇప్పుడు ఊరంతా ట్రాక్టర్లే ఉన్నయ్. ఒకలతోని ఒకలు పోటీ పడి పత్తిపంట సాగు చేసి ఫాయిదాకు వస్తండ్లు.

– ఇందూరి సాంబయ్య, రైతు


పత్తి పంటతోనే లాభాలు



ఊరి రైతులంతా పత్తి పంటనే ప్రధానంగా సాగు జేస్తున్నం. చెరువు ఉన్న 250 ఎకరాలకు మించి వరి పంట వేయం. ఆంధ్ర ప్రాంత రైతులు వచ్చి మా భూములు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసి లాభాలు పొందిండ్లు. గాళ్ల దగ్గర కూలీలుగా పని చేసి మేముసుత పత్తిపంట సాగు జేసుడెట్లో నేర్చుకున్నం. ఇప్పుడు పత్తి పంట ఎట్ల సాగు జేస్తే లాభమో తెలుసుకున్నం. గా పంటతోనే ఊరి రైతులు లాభాలు గడిస్తండ్లు. అందరికీ చేతినిండా పని దొరుకుతంది.

– ఇందూరి అశోక్, రైతు

జొన్న సాగు జేస్తే ఫాయిదా ఉండేది కాదు



పత్తి పంట సాగుకు మొదాలు జొన్న, కంది, మిర్చి, పెసర పంటలు సాగు చేసినం. ఆ పంటల వల్ల మాకు ఎలాంటి లాభం ఉండకపోయేది. బతుకుడు కష్టమయ్యేది. ఫాయిదా లేని పంటలు పండించి నష్టపోయినం. మా బతుకుల్లో ఎలాంటి ఆనందం ఉండకపోయేది. పత్తి సాగు చేసినప్పటి నుంచి కొద్దికొద్దిగా మా చేతులల్ల డబ్బులు కనిపించడం మొదలైంది. ఇప్పుడు ఊళ్ళ అందరి మొఖాల్లో ఆనందం కనబడ్తంది.

– ఆవుల తిరుపతి, రైతు

ట్రాక్టర్లతోని ఊరికి కళొచ్చింది



పత్తి పంట సాగు చేయబట్టి మా ఊరి నిండా ట్రాక్టర్లు కళకళలాడుతున్నయ్. ఏ ఊరిలో లేనన్ని ట్రాక్టర్లు ఉండడం మాకు సంతోషమేస్తంది. ట్రాక్టర్లు వచ్చుడు చేయబట్టి మా బతుకుల్లో ఎంతో మార్పు వచ్చింది. సర్కారు నుంచి సబ్సిడీకి మాకు ట్రాక్టర్లు ఇయ్యలే. రైతులంతా ప్రైవేట్ ఫైనాన్స్ నుంచి లోను తీసుకుని ట్రాక్టర్లు తీస్కచ్చినం. పంట పండించి ట్రాక్టర్ లోన్ తీరుస్తున్నం. ట్రాక్టర్ల షోరూం వాళ్లే మా ఊరికి వచ్చి ట్రాక్టర్లు తీస్కోండని చెప్తండ్లు. గింతకన్న మాకేం కావాలే.

– కాశెట్టి శ్రీనివాస్, రైతు

మంచిర్యాలలో కృతిశెట్టి సందడి



మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో హీరోయిన్ కృతిశెట్టి సందడి చేసింది. పట్టణంలో ఏర్పాటు చేసిన చెన్నయ్ షాపింగ్‌మాల్‌ను శనివారం ఆమె ప్రారంభించింది. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, షాపింగ్‌మాల్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎం.వెంకటరెడ్డి, శౌధర్‌రెడ్డి పాల్గొన్నారు. హీరోయిన్‌ను చూసేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

- వివరాలు 8లో

నేడు నీట్

మంచిర్యాలఅర్బన్: వైద్య విద్యలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే 2023–నీట్‌కు సిద్ధం చేశారు. ఆదివారం జరిగే పరీక్షకు జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్మెల్ సీబీఎస్‌ఈ, కార్మెల్ హైస్కూల్, ట్రినిటీ హైస్కూల్, ఉషోదయ హైస్కూల్, సెవెన్‌హిల్స్ స్కూల్, మౌంట్ కార్మెల్(గుడిపేట్) హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో 1447 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5.20గంటల వరకు పరీక్షలు జరుగుతాయని సిటీ కో–ఆర్డినేటర్ రేసమ్మ ఏ.ఎస్ తెలిపారు.

రేషన్ డీలర్ ఎంపికపై హైకోర్టులో పిటిషన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో రేషన్ డీలర్ల ఎంపికపై ఓ అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించాడు. ఎంపికలో అక్రమాలు జరిగాయని నస్పూర్‌కు చెందిన బొజ్జ నర్సయ్య హైకోర్టులో కేసు వేశారు. ఆర్కే 6 సింగాపూర్ రేషన్ దుకాణం ఎంపికైన అభ్యర్థితో సహా రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కలెక్టర్, మంచిర్యాల ఆర్డీవో, నస్పూర్ తహసీల్దార్‌తో సహా ఆరుగురిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఫిర్యాదుదారు న్యాయవాది నుంచి డీలర్‌గా ఎంపికైన అభ్యర్థికి లీగల్ నోటీసులు వెళ్లాయి. తదుపరి విచారణకు హాజరు కావాల్సిందిగా ఆ నోటీసులో పేర్కొన్నారు.

సౌర వెలుగులు!



జైపూర్ థర్మల్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన నీటిపై తేలియాడే సౌర విద్యుదుత్పత్తి పలకలు

- సింగరేణి సోలార్ ప్లాంట్ల నిర్మాణాలు ముమ్మరం
- జిల్లాలోనే వంద మెగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి
- రెండేళ్లలో అందుబాటులోకి మరిన్ని ప్లాంట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు విక్రయిస్తూ దేశంలో వెలుగులు పంచడంలో కీలక పాత్ర పోషిస్తూనే, సొంతంగా పర్యావరణ హితంగా సౌర విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. వచ్చే రెండేళ్లలో 'నెట్ జీరో ఎనర్జీ' సంస్థగా మారేందుకు ప్రయత్నిస్తోంది. అంటే కంపెనీకి కావాల్సిన విద్యుత్ సొంతంగా తయారు చేసుకోవడం. అందులోనూ పర్యావరణానికి నష్టం లేకుండా ఉత్పత్తి చేయడాన్ని వేగవంతం చేసింది. రెండేళ్ల క్రితమే సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాలు ప్రారంభించింది. కంపెనీలో ప్రధానంగా జిల్లా పరిధిలో జైపూర్ థర్మల్ ప్లాంట్, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో సౌర విద్యుత్ ఇప్పటికే మొదలైంది. వచ్చే రెండేళ్లలో మరింత పెంచుకునేలా ప్రణాళికలు వేసింది. రెండో విడతలోనూ జిల్లాలో మరిన్ని ప్లాంట్ల నిర్మాణం చేపట్టి విద్యుదుత్పత్తి చేయనుంది.

దశల వారీగా ప్లాంట్ల నిర్మాణాలు..

మొదటి దశలో 300 మెగావాట్ల సామర్థ్యం, రెండవ దశలో 240 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్లు సింగరేణి వ్యాప్తంగా నిర్మించాలని ప్రణాళికలు వేశారు. సింగరేణిలోని తొమ్మిది ఏరియాల్లోని ఖాళీ ప్రదేశాలను గుర్తించి రెండవ దశలో 240 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పాదన లక్ష్యసాధనకు ప్రణాళికలు వేశారు. మొదటి దశకు సంబంధించి జిల్లా పరిధిలో జైపూర్ థర్మల్‌ప్లాంట్‌లో భూమిపై 10మెగావాట్లు, రెండు రిజర్వాయర్లపై ఐదు మెగావాట్ల చొప్పున, పది మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 15మెగావాట్లు అవుతోంది. మిగతా ఐదు మెగావాట్లు అందుబాటులోకి రానుంది. రెండో దశలో శ్రీరాంపూర్, చెన్నూరు ప్రాంతాల్లో 27.5మెగావాట్లు, మందమర్రి ఏరియాలో కాసిపేట, పాలచెట్టు తదితర ప్రాంతాలతో కలిపి 65మెగావాట్ల సామర్థ్యంతో ఐదు ప్లాంట్లు నిర్మాణం చేపట్టనున్నారు.

రెండేళ్లలో మరిన్ని వెలుగులు

సంస్థ ప్రస్తుతం 750మిలియన్ల యూనిట్లు విద్యుత్ వినియోగిస్తోంది. ఒక యూనిట్‌కు రూ.8కొనుగోలు చేసి, ఏటా రూ.600కోట్ల బిల్లులకే వెచ్చిస్తోంది. ఈ ఖర్చు తగ్గించుకునేందుకే సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు రెండేళ్ల క్రితమే ప్రణాళికలు వేసి అమలు పరుస్తున్నారు. మొదటి దశలో తొమ్మిది ప్లాంట్లలో 224మెగావాట్లు, రెండో దశలో 240మెగావాట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో మరో 76మెగావాట్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఇది కూడా పూర్తయితే 450మిలియన్ల యూనిట్ల ఉత్పత్తి మొదలవుతుంది. రెండోదశ 13 ప్లాంట్లు పూర్తయితే మరో 240మెగావాట్లతో కలిపి, 360మిలియన్ల ఉత్పత్తి అవుతుంది. కంపెనీ వ్యాప్తంగా 540మెగావాట్ల ప్లాంట్ల నుంచి 810మిలియన్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే రెండేళ్లలో సంస్థ ఉపయోగించే మొత్తం విద్యుత్ స్వయంగా ఉత్పత్తి చేసుకుని 'నెట్ జీరో ఎనర్జీ' కంపెనీగా మారనుంది.

ఖాళీ జాగాలను వాడుకుంటూ..

సింగరేణి కంపెనీకి వందల ఎకరాల భూమి ఉంది. ఇందులో మూసివేసిన గనులతోపాటు కార్మికులు, కంపెనీ వివిధ అవసరాల కోసం తీసుకున్న భూములు ఉన్నాయి. ఈ భూమిని తిరిగి వినియోగంలోకి తేవడంతోపాటు భవిష్యత్‌లో డిమాండ్ ఉన్న సోలార్ విద్యుత్‌పై కంపెనీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే చెన్నూరు ప్రాంతంలో బొగ్గు గనుల కార్యకలాపాలు తగ్గినప్పటికీ మళ్లీ సౌర ప్లాంట్లతో కార్యక్రమాలు మొదలు పెట్టింది. దీంతో సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తి, రవాణాకే పరిమితం కాకుండా సొంతంగా కరెంట్ తయారు చేసుకునేలా చర్యలు ప్రారంభించింది. ఇక జైపూర్ థర్మల్ ప్లాంట్‌లో నీటిపై తేలియాడే పలకలను బిగించి సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది.

రైతుల నుంచి ధాన్యం కొనాలి



రవీందర్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ జిల్లాలోని బీమారంలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియెట్ గోదామును సందర్శించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పౌరసరఫరాల శాఖ అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ.ప్రేమ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి

నస్పూర్: నస్పూర్ పట్టణంలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. శనివారం ఆయన జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మొక్కల పెంపకం పరిశీలించారు. అంతర్గత రోడ్లు త్వరగా పూర్తి చేయాలని, ప్రతీ శాఖ కార్యాలయానికి విద్యుత్ సరఫరా, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

'ఎమ్మెల్సీగా చేసిన అభివృద్ధి ఏది?'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేసిన అభివృద్ధి ఏంటని, అప్పుడు చేయకుండా ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏదో అభివృద్ధి చేస్తానంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రం సుందరీకరణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నాలుగు చోట్ల జంక్షన్లు మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్నారని, అందులో ఏదో అవినీతి జరుగుతోందంటూ పనికిరాని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, కొత్తగా ఆసుపత్రి నిర్మాణానికి నిధుల కేటాయింపు అనే అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ స్థలం కేటాయింపుపై అసమర్థ ఆరోపణలు చేస్తూ, ప్రజలకు అందే సేవలను ఎగతాళి చేయడం సరికాదన్నారు. డబ్బులు బాగా ఉన్నాయని అంటూనే బ్యాంకుల్లో రూ.500 కోట్ల మేర రుణాలు తీసుకున్నారని, భూముల కబ్జాలతో డబ్బు సంపాదిస్తూ ఏదో సేవ చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ పీడీ రవీందర్‌రావు బదిలీ

• కొత్త పీడీగా జీవీ.బీమాసేనారెడ్డి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ), పీఐయూ రవీందర్‌రావు చెన్నయ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ రీజనల్ ఆఫీసులో డీజీఎం హోదాలో పని చేస్తున్న జీవీ.బీమాసేనారెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. దేశ వ్యాప్తంగా 12మంది ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు బదిలీలు అయ్యారు. ఈ నెల 4న రవీందర్‌రావు రిలీవ్ అయినప్పటికీ కొత్త పీడీ ఇంకా విధుల్లోకి చేరలేదు. దీంతో ఆయననే ఇన్చార్జీగా కొనసాగుతున్నారు. శనివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎన్‌హెచ్ ఉద్యోగులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు పలువురు ఆయనకు వీడ్కోలు పలుకుతూ సన్మానించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలో చేపడుతున్న జాతీయ రహదారులు 363, 63, కొత్తగా బెల్లంపల్లి నుంచి గడ్చిరోలీ గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం వరకు రవీందర్‌రావు భాగస్వామ్యులు అయ్యారు. ముఖ్యంగా ఎన్‌హెచ్ 363 నిర్మాణం పనులు వేగం పెంచడంలో కీలకంగా పని చేశారు.

'టోల్ ప్లాజా'పై కౌంటర్ దాఖలు

మందమర్రి టోల్ ప్లాజా వద్ద నిబంధనలు పాటించడం లేదని బెల్లంపల్లికి చెందిన న్యాయవాది రవికుమార్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఫిర్యాదుపై జరుగుతున్న విచారణపై జిల్లా అడిషనల్ కలెక్టర్ (భూసేకరణ) కౌంటర్ దాఖలు చేశారు. ఫిర్యాదుదారు అభ్యంతరాలపై మంచిర్యాల ఆర్డీవో విచారణ అధికారిగా నియమించినట్లు పేర్కొన్నారు. 19కిలోమీటర్ల దూరంలో వాహనదారులకు పాస్‌ల జారీ, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, వీఐపీ, భారీ వాహనాలు, టూ వీలర్, ఆటోలకు టోల్ గేట్ వద్ద ఫీజు తీసుకోవడం లేదని వివరించారు. ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం టోల్ గేట్ వద్ద రుసుము తీసుకున్నట్లు ఆర్డీవో విచారణలో తేలినట్లు తెలిపారు.

14మంది సర్వేయర్ల బదిలీ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని 14 మండలాల్లో పనిచేస్తున్న ల్యాండ్ సర్వేయర్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ బి.సంతోష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సర్వేయర్	ప్రస్తుతం	బదిలీ స్థానం
పి.నరసింహరాజు	జైపూర్	చెన్నూర్
ఎం.ప్రసాద్	చెన్నూర్	మంచిర్యాల
ఎస్.మనిరాజు	నెన్నెల	బెల్లంపల్లి
జి.క్రిష్ణప్రియ	తాండూర్	హాజీపూర్
జి.సైదులు	కోటపల్లి	లక్సెట్టిపేట
జి.సురేష్‌క్రిష్ణ	ఏడీ కార్యాలయం	జన్నారం
ఎస్.కృష్ణ	భీమిని	నెన్నెల
ఏ.సాయికృష్ణ	నస్పూర్	కోటపల్లి
జి.మధుకర్	హాజీపూర్	జైపూర్
జి.సుధాకర్	బెల్లంపల్లి	తాండూర్
కే.శ్రీనివాస్	ఏడీ కార్యాలయం	భీమిని
సీహెచ్.ప్రశాంత్	ఏడీ కార్యాలయం	వేమనపల్లి ఇంచార్జీ
ఎస్.దశరథం	ఐకేపీ సర్వేయర్	దండేపల్లి ఇంచార్జీ సర్వేయర్

క్లుప్తంగా

ఏడుగురిపై పిచ్చికుక్క దాడి


కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామపంచాయతీలో శనివారం పిచ్చికుక్క ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. స్థానికుల వివరాల ప్రకారం... జజ్జరవెల్లి గ్రామంలో ఓ కిరాణ షాపు వద్ద రోడ్డుపై వచ్చిన వారిపై దాడి చేస్తూ గాయపర్చింది. దీంతో స్థానికులు కుక్కను హతమర్చారు. గాయపడిన వారు వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో పిచ్చికుక్కలను చంపివేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ, అధికారులు

బెల్లంపల్లి: విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను శనివారం బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయంలో డిస్కం అధికారులు ఏసీపీ పంతాటి సదయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిస్కం ఎస్ఈ శేషారావు మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. తెగిన వైర్లు, స్తంభాలను ముట్టుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డిస్కం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్కం బెల్లంపల్లి పట్టణ ఏడీఈ శ్రీనివాస్, బెల్లంపల్లి రూరల్ ఏడీఈ రాంచందర్, ఏఈలు శ్రీనివాస్, రాంమనోహర్, ప్రభాకర్ ఉన్నారు.

పంప్‌హౌస్ సర్వేను అడ్డుకున్న రైతులు


అధికారులతో మాట్లాడుతున్న రైతులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామ శివారులో నిర్మించే పంప్‌హౌస్ నిర్మాణం కోసం శనివారం గ్రిడ్ సర్వే చేయడానికి వచ్చిన ఇరిగేషన్ అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఎలాంటి సమాచారం లేకుండానే తమ పంట పొలాల్లో సర్వే చేపడుతున్నారని రైతులు మండిపడ్డారు. ఈ భూములే మాకు ఆధారమని, తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా సర్వే చేయద్దని తెలిపారు.

గ్రూపు-4 స్టడీ మెటీరియల్ పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల షణ్ముఖ సాయి ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డేవలపర్స్ ఆధ్వర్యంలో గ్రూప్-4 పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే దివాకర్‌రావు, జేసీ మధుసూదన్‌నాయక్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ బేతి తిరుమల్‌రావు ఆధ్వర్యంలో 500 మందికి విన్నర్ పబ్లికేషన్ పుస్తకాలు అందజేశారు. సర్వే నీడి ఫౌండర్ గౌతమ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ పెంటరాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, షణ్ముఖ సాయి డెవలపర్స్ డైరెక్టర్లు శ్యాంసుందర్, బేతి సత్యం, ఆనంత సాయి పాల్గొన్నారు.

అమ్మానాన్న భారమా..?!

సండే స్పెషల్

- నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధులు
- అధికారులను ఆశ్రయిస్తున్న వైనం
- ఇకపై ఫిర్యాదులకు వెబ్‌సైట్

వృద్ధాప్యం శాపంగా మారుతోంది. కనిపెంచిన తల్లిదండ్రులను అవసాన దశలో ఆదరించలేమంటూ సంతానం చేతులెత్తేస్తుడడం కలవరపెడుతోంది. ఆస్తులు పంచుకుని ఆప్యాయతను పంచలేమంటూ పిల్లలు ఎవరిదారి వారు చూసుకోవడంతో ఒంటరిగా జీవనం గడపాల్సి వస్తోంది. మరికొందరు పిల్లలు తల్లిదండ్రులను వంతులవారీగా చేరదీస్తుండడం వారిని మానసిక వేదనకు గురి చేస్తోంది. పిల్లల కోసం తమ జీవితాన్ని.. సర్వస్వాన్ని ధారబోసిన తల్లిదండ్రులకు జీవిత చరమాంకంలో ఆదరణ కరువవుతోంది. ఇటీవల సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన మెడబోయిన వెంకటయ్య(90) నలుగురు కుమారుల వద్ద వంతులవారీగా పోషణపై కలత చెంది ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ నిరాదరణకు గురవుతున్న వృద్ధులు అధికారులు, పోలీసులను ఆశ్రయించడం కనిపిస్తోంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్


కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన భాగాపూర్ వృద్ధ దంపతులు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కొన్ని ఘటనలు

- వృద్ధాప్యంలో ఉన్న తన పోషణ బాధ్యత చూడకుండా కొడుకు ఇంటి నుంచి వెళ్లగొట్టాడని, పోషణ కోసం కొంత సొమ్ము ఇప్పించాలని మంచిర్యాల జిల్లా తీగలపాడ్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పూదరి చంద్రయ్య మార్చి 14న కలెక్టర్ సంతోష్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ద్వారక గ్రామానికి చెందిన సూరినేని రాజయ్య(80)కు పిల్లలు లేరు. తన అన్న కొడుకు చిరంజీవి వద్ద కరీంనగర్‌లో కొన్ని రోజులు ఉన్నాడు. తన వద్ద ఉన్న రూ.3లక్షలు, రెండు తులాల బంగారం తీసుకుని ఇవ్వడం లేదని, అతడిపై చర్యలు తీసుకుని డబ్బులు, బంగారం ఇప్పించాలని గత నెల 18న ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌ను ఆశ్రయించాడు.
- నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం భాగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు చేసి ఓ ఇంటి వారిని చేశారు. ఆస్తిని పంచుకున్న పిల్లల్లో ఇద్దరు తల్లిదండ్రుల ఆలనాపాలనా తమ బాధ్యత కాదన్నారు. దీంతో చిన్న కుమారుడి సహాయంతో మిగతా ఇద్దరు కుమారులపై నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు..

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటనెన్స్ కేసెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(టీఎస్‌సీఎంఎంఎస్)ను ఆర్డీవోల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. వేధింపులు, అఘాయిత్యాలపై వయోవద్ధులు ఫిర్యాదు చేసిన వెంటనే సత్వర న్యాయం చేయడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. తమ ఫిర్యాదులపై చర్యలు ఏ స్థాయిలో తీసుకుంటున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఫిర్యాదులపై జిల్లా సంక్షేమ అధికారి, జిల్లాలోని రెవెన్యూ అధికారులు, కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు.

కొందరికి 'ఆసరా'

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వృద్ధులకు ఆసరా పింఛన్ కొంతవరకు భరోసానిస్తోంది. నెలనెలా అందే పింఛన్ డబ్బులను అవసరమైన మందులు, అనారోగ్య సమస్యలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. పింఛన్ అందుతుండడంతో పిల్లల నుంచి కొంతవరకు గౌరవం లభిస్తుందనే అభిప్రాయాన్ని వృద్ధులు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,36,757మంది రూ.2,016 చొప్పున పింఛన్ అందుకుంటున్నారు.

జిల్లాల్లో ఆసరా పింఛన్లు పొందుతున్న వృద్ధుల సంఖ్య	
ఆదిలాబాద్	31,404
మంచిర్యాల	40,921
నిర్మల్	39,462
కుమురంభీం	24,970

అనాథాశ్రమాలు.. ఆలయాలే దిక్కా..?



కారణాలు ఏవైనప్పటికీ పిల్లల ఆదరణ లేని తల్లిదండ్రులు కొందరికి అనాథ ఆశ్రమాలు, ఆలయాలే దిక్కవుతున్నా యి. అనాథ వృద్ధాశ్రమా ల్లో కొందరు ఆశ్రయం పొందుతుండగా మరికొందరు ఆలయాల వద్ద భిక్షాటన చేస్తున్నారు.

- మహారాష్ట్రలోని బోకర్ గ్రామానికి చెందిన గంగుబాయికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త చనిపోయి ఐదేళ్లు అవుతోంది. కుమారులు ఆలనాపాలన చూడకపోవడంతో నాలుగేళ్లుగా నిర్మల్ జిల్లా బాసర ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ పొట్టపోసుకుంటోంది.
- కామారెడ్డి పట్టణానికి చెందిన వడ్డెర భూమవ్వకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడేళ్ల క్రితం భర్త చనిపోవడంతో కొడుకు వద్ద ఏడాదిపాటు ఉంది. గత సంవత్సరం కొడుకు అనారోగ్యంతో చనిపోవడంతో కూతుళ్ల వద్ద ఉండలేక నిర్మల్ జిల్లా బాసర ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తోంది.

ఇదీ వెబ్‌సైట్ :
https:// tsseniorcitizens. cgg. govt. in
ఎల్డర్‌లైన్ నంబరు :
14567

భయపడాల్సిన అవసరం లేదు



వయో వృద్ధుల మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రుల సంక్షేమం కొడుకులు గానీ వారి ఆస్తికి ఎవరైతే వారసులవుతారో వారే చూసుకోవాలి. ఒకవేళ ఆస్తి తీసుకున్న తర్వాత పట్టించుకోకపోతే ఆర్డీవో ట్రిబ్యునల్‌లో కేసు వేసుకునే అవకాశం ఉంది. సీఆర్‌పీసీ 125 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి మనోవర్తి పొందవచ్చు. న్యాయస్థానం తీర్పును నిరాకరించినట్లయితే ఆరు నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తుంది. – శిల్పాశర్మ, న్యాయవాది, నోటరీ, మంచిర్యాల

వృద్ధులకు అండగా ఉంటున్నాం



మంచిర్యాల జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి వృద్ధులు, నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి ఆస్తులను తీసుకుని, వారిని చూసుకోవడంలో ఇబ్బంది పెడుతున్న వారిలో ఇప్పటికీ తొమ్మిది మందికి చట్టప్రకారంగా న్యాయం జరిగేలా చేశాం. ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం వల్ల వృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం వారికి సరైన న్యాయం జరుగుతుంది. తల్లిదండ్రులు, పిల్లలతో అసోసియేషన్ సమక్షంలోనే మాట్లాడి సమస్య పరిష్కరిస్తున్నాం. పరిష్కారం కాకుంటే, ఆర్డీవోకు ఫిర్యాదు చేసి చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూస్తాం.
– బొలిశెట్టి రాజలింగు, మంచిర్యాల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సేవలు మెరుగుపర్చాలి


డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీంఎఎస్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సీపీఆర్ఎం స్కీం కార్డుల కింద అందించే వైద్య సేవలు సరిగ్గా లేవని, వీటిని మెరుగుపర్చాలని కోరుతూ సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్ (బీఎంఎస్) నాయకులు కంపెనీ డైరెక్టర్(పా, ఫైనాన్స్) యన్.బలరాంను కోరారు. ఈ మేరకు ఆ యూనియన్ బీఎంఎస్ వేజ్‌బోర్డు సభ్యులు కె.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మండ రమాకాంత్, టీ ఎస్ పవన్‌కుమార్‌లు శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సీపీఆర్ఎంస్ కార్డులు వచ్చిన తరువాత కంపెనీ ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరిన కూడా వారి వద్ద నుంచి బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ బిల్లులు కార్డు నుంచి డెబిట్ అవుతున్నాయని పేర్కొన్నారు. కంపెనీ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్సలు అందించాల్సి ఉండగా ఇలా బిల్లులు వసూలు చేయడం మానుకోవాలని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి దూర ప్రాంతాల్లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు దీర్ఘకాలిక మందుల కోసం కంపెనీ ఆసుపత్రులకు రావడం ఇబ్బందిగా ఉందని, ఆయా పట్టణాల్లో కంపనీ రెఫరల్ ఆసుపత్రుల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి మందులు ఇవ్వాలని కోరారు.రెఫరల్ ఆసుపత్రుల్లో చికిత్స పొందితే దానికి సంబంధించిన బిల్లులన్నీ నిమ్స్ టారిఫ్ ప్రకారం అదనంగా చెల్లించాల్సింది వస్తుందని, దీనిని కంపెనీ భరించాలని తెలిపారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జీఎం దేవేందర్


లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న రాంమ్మోహన్‌రావు

శ్రీరాంపూర్: మేడే సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ నుంచి శ్రమశక్తి అవార్డు అందుకున్న టీబీజీకేఎస్ జీఎం కమిటీ చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్‌ను రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూర్ రామ్మోహన్‌రావు మంచిర్యాలలోని ఆయన నివాసంలో సత్కరించారు. కార్మిక వర్గానికి ఆయన చేసిన సేవలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. మరింత ఉత్సాహంగా పని చేయాలని ఆకాంక్షించారు.

జీఎం సన్మానం

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని శ్రమశక్తి అవార్డును అందుకున్న ఖైరిగూడ ఓసీపీ సీనియర్ మైనింగ్ సర్దార్‌గా పని చేస్తున్న గజ్జెల్లి చంద్రశేఖర్‌ను శనివారం జీఎం కార్యాలయంలో జీఎంతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు, ఎస్‌వోటూజీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అన్‌ఫిట్ కేసులపై సమీక్ష


సమీక్షలో పాల్గొన్న డీజీఎం అరవిందరావు

శ్రీరాంపూర్: మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి మెడికల్‌కార్డులు, కారుణ్య ఉద్యోగాల కేసులపై జీఎం(పర్సనల్) బసవయ్య శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం ఆయన కొత్తగూడెం నుంచి శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అరవిందరావుతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య ఉద్యోగాలు ఎంత మందికి ఇచ్చారు, ఇంకా ఎన్ని కేసులు ప్రాసెస్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సీఎంపీఎఫ్ సెటిల్‌మెంట్లు, రిటైర్డ్ అయిన తరువాత వారికి సీపీఆర్ఎంస్ కార్డులు త్వరగా అందేలా చూడాలన్నారు. పీఎం రాజేశ్వర్, డీ వైపీఎంలు రాజేశ్, దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సీనియర్ పీఏ కాంతారావులు పాల్గొన్నారు.

మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా మధుకర్

పాతమంచిర్యాల: తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా జి ల్లాకు చెందిన పొట్ట మధుకర్‌ను నియమించినట్లు తెలంగాణ మాల మహా నాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ నియామక ప్రక్రియ నిర్వహించామన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న మధుకర్

మంచిర్యాలలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం


ప్రారంభిస్తున్న హీరోయిన్ కృతిశెట్టి

- సందడి చేసిన హీరోయిన్ కృతిశెట్టి
- చూసేందుకు తరలివచ్చిన ప్రజలు


పరిశీలిస్తున్న కృతిశెట్టి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, హీరోయిన్ కృతిశెట్టి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో వస్త్రాభరణాలను అందించే చెన్నయ్ షాపింగ్ మాల్‌ను మంచిర్యాలలో ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మాట్లాడుతూ ప్రముఖ నగరాల్లో ఉండే షోరూంలకు మించిన స్థాయిలో మంచిర్యాలలో షోరూంను అన్ని హంగులతో తీర్చిదిద్దారని తెలిపారు. షోరూం మేనేజింగ్ డైరక్టర్లు ఎం.వెంకట్‌రెడ్డి, శిధర్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన తమ షోరూంలు ప్రతిచోటా అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రజల మన్ననలతో నంబర్ 1 షోరూంగా నిలుస్తుండడం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. అన్ని ఆదాయ వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సంప్రదాయ వస్త్రాలు, మోడ్రన్ ఫ్యాషన్లను అందించడంలో మరింత ముందుంటామని అదే తమ విజయరహస్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ కమెడియన్లు అదిరే అభి, రాజమౌళి, సద్దాం, ఇమానియెల్ కామెడీతో ఆకట్టుకున్నారు. హీరోయిన్ కృతిశెట్టిని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రాగా అభిమానులతో మాట్లాడి వారిలో మరింత జోష్‌ను నింపారు.

చెన్నయ్ షాపింగ్ మాల్‌లోనే కొంటాను

మంచిర్యాలలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభానికి అవకాశం రావడం అదృష్టమని, తాను చెన్నయ్ షాపింగ్ మాల్‌లోనే వస్త్రాలను కొంటానని హీరోయిన్ కృతిశెట్టి అన్నారు. షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన అనంతరం చీరలను పరిశీలించారు. ఇక్కడ అన్ని రకాల డిజైన్లు, వెరైటీలు, లేటెస్ట్ మోడల్‌లు లభిస్తాయని, ఈ ప్రాంత ప్రజలు షాపింగ్ చేసుకోవాలని కోరారు.

10న వాలీబాల్ జట్ల ఎంపిక

మంచిర్యాలటౌన్: ఈ నెల 10వ తేదీన వరంగల్ జిల్లాలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్ల శంకర్, మైలారం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16 ఏళ్ల బాలబాలికలు సంబంధిత వయస్సు ధృవీకరణ పత్రాలు, 5 పాస్ ఫొటోలు వెంట తీసుకెళ్లాలని, ఇతర వివరాలకు 9951246104, 9676590211 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అయ్యప్ప సేవా పురస్కార్‌కు రఘుపతిరావు ఎంపిక

శ్రీరాంపూర్: జాతీయ స్థాయి అయ్యప్ప సేవా పురస్కార్‌కు నస్పూర్‌కు చెందిన బీర్‌పూర్ రఘుపతిరావు ఎంపికైనట్లు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు తెలిపారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందించనున్నారు. తిరుమల్‌రావు నస్పూర్ కాలనీ హౌజింగ్ బోర్డు కాలనీలో లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ఈ పురస్కారం రావడంపై ఏబీఏపీ జిల్లా అధ్యక్షుడు వజ్రవేళు, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరబద్రస్వామి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ల రాజేశంలు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థిక సమానత్వం కోసం పోరాటం

బెల్లంపల్లి: ప్రజల్లో ఆర్థిక సమానత్వం కోసం పోరాటం సాగిస్తామని న్యూ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేవీ రాజు పటేల్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు గడిచిపోతున్నా ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. పేదరికంతో ,ఆర్థికంగా చితికి పోతున్నారని అన్నారు. ఇందుకు పాలకులే ప్రధాన కారణమన్నారు. రాష్ట్రంలో తమపార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో న్యూఇండియా పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, వేముల అశోక్, గోపాల్ , జాతీయ సమితి సభ్యులు బబిత సోని, రాష్ట్ర కన్వీనర్ తిరుపతి జనగామ, మహారాష్ట్ర ఇన్‌చార్జి తిరుపతి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ ఉన్నారు.

ఘనంగా పెర్సాపేన్‌కు పూజలు


బేటింగ్ అవుతున్న కొత్త కోడళ్లు


మొక్కులు చెల్లిస్తున్న మహిళలు


పెర్సాపేన్‌కు మొక్కుతున్న భక్తులు

కెరమెరి: ఈ నెల ఆదివాసీ దేవుళ్ల పండుగ మాసమని అంటారు. ఆదివాసీలున్న ప్రతీ ప్రాంతంలో తమతమ ఆచార వ్యవహారాలతో పెర్సాపేన్‌కు పూజలు చేస్తారు. మండలంలోని హట్టి గ్రామంలో శనివారం మెసల్కార్ మడావి వంశస్తులు పెర్సాపేన్ (పెద్దదేవుడు)కు పూజలు నిర్వహించారు. పెద్ద దేవుడి ముందు మహిళలు ఆచార వ్యవహారాలతో పుట్నాలను సమర్పించారు. 22(44 జతలు) మంది కొత్త కోడళ్ల బేటింగ్ అయ్యారు. అనంతరం సంప్రదాయబద్ధంగా వరుసలో నిలబడి పూజలు చేశారు. గంగకు వెళ్లి పవిత్ర జలాన్ని తీసుకొచ్చి గ్రామంలో చల్లారు. ఇలా చేయడంతో పంటల్లో దిగుబడి వస్తుందని వారి నమ్మకం. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మడావి వంశస్తులు పెర్సాపేన్‌ను దర్శించుకున్నారు. ఇందులో కటోడా మడావి లక్ష్మణ్, ఆత్రం లక్ష్మణ్, అనంత్‌రావు, పటేల్ దంబిరావు, దేవారి భీంరావు, జంగు, మహదు, సాక్రుబాయి ఉన్నారు.